క్లుప్తంగా

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం



పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: డివిజన్లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 37వ డివిజన్ జయకృష్ణాపురం రామకృష్ణ మిషన్ వెనుక రూ.35 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పునర్నిర్మాణ పనులను గురువారం ఆయన కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో పారదర్శకత పాటిస్తూ, నాణ్యతతో చేపట్టాలన్నారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి సబ్బారపు సూరిబాబు, బాలాజీ రెడ్డి, నామన వాసు, అరిగెల బాబు, తొలేటి శ్రీరాములు, నాగిరెడ్డి, సీరపు గణేష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల పాత్ర చాలా కీలకం

కంబాలచెరువు: పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నిర్వహించాల్సిన రికార్డులను వివరించారు. ఇన్‌స్పెక్షన్, రిజిస్టర్, విజిటర్స్ రిజిస్టర్స్, అకడమిక్ గైడెన్స్ రిజిస్టర్, స్టాఫ్ ఆర్డర్ రిజిస్టర్లు అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంటాయన్నారు. ఉదయం అసెంబ్లీ నుంచి పాఠశాల ముగిసే వరకూ ప్రతి అంశాన్నీ జాగ్రత్తగా గమనించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు.

ఘాట్లలో అన్ని వసతులు కల్పించాలి



ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రికి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని, వారికి అన్ని రకాల వసతులు కల్పించాలని నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బందికి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని సూచించారు. స్థానిక చింతాలమ్మ ఘాట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘాట్లలో శుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, మజ్జి రాంబాబు, కొయ్యల రమణ, బుడ్డిగ గోపాలకృష్ణ ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ గురువారం తెలిపారు.

- ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గోకవరం బస్టాండ్ ఏరియా, శేషయ్య మెట్ట, మునిసిపల్ ఆఫీస్ ఏరియా, కృష్ణానగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సుబ్బారావు నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పీఅండ్‌టీ, 5వ నంబర్ బస్టాండ్, కోరుకొండ రోడ్, రాజా థియేటర్, క్వారీ సెంటర్, టీవీ రోడ్, కొంతమూరు, భవానీపురం, రామదాస్ పేట, పనసచెట్టు సెంటర్, సంజీవ నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

అన్నసమారాధన

ప్రకాశం నగర్: మల్లయ్యపేట శాంతినగర్ కాలనీలో గురువారం వీరభద్ర స్వామి సంబరం ఘనంగా నిర్వహించారు. అనంతరం సుమారు 5 వేల మందికి అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శివ భవాని మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు ఒకసారి వీరభద్రస్వామికి బోనం పోసి ఉపవాసం ఉండి జమ్మి చెట్టుకు వెళ్లి దీపారాధన చేస్తామన్నారు.

రేపు విగ్రహాల ప్రతిష్ఠ

కడియం: వేమగిరి ఉన్నత పాఠశాల పక్కన నిర్మించిన సాక్షి గణపతి, సాయిబాబా, దత్తాత్రేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలు శనివారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. భక్తుల సహకారంతో నిర్మించిన ఈ ఆలయంలో ప్రతిష్ఠాపనా మహోత్సవాల్లో భాగంగా గణపతి విగ్రహాన్ని తిరుపతి, సాయి, దత్తాత్రేయ విగ్రహాలను జైపూర్ నుంచి తీసుకువచ్చారు. వీటికి గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. భారీ ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం ప్రత్యేక పూజలు, శనివారం ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు.

శరవేగంగా రోడ్ల మరమ్మతులు

- ఇక రాకపోకలు సులభం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



రోడ్డు మరమ్మతులను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ (ఫైల్)

కడియం: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని రోడ్ల ఇబ్బందులు తీరనున్నాయి. గత ప్రభుత్వం అలసత్వం కారణంగా రోడ్లు ఇప్పటి వరకు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ప్రజల ఇబ్బందులను గమనించి పలు రోడ్ల మరమ్మతులకు రోడ్లు, భవనాల శాఖ కార్యాచరణ రూపొందించింది. కడియం – వెదురుమూడి రోడ్డు పనులకు రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఇటీవలే కొబ్బరికాయలు కొట్టారు. నియోజకవర్గం ప్రజలకు రోడ్ల ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

ఇంటికే సంక్షేమ పథకాలు

అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకే సంక్షేమ పథకాలు అందిస్తూ సరికొత్త ఒరవడికి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం నాంది పలికింది. అయితే విమర్శలకు ఎప్పుడూ సిద్ధంగా ఉండే ప్రతిపక్షాలు ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలను, వాటి ప్రయోజనాలను పక్కన పెట్టి రోడ్లు పట్టించుకోవడం లేదంటూ విమర్శలకు దిగుతున్నారు. ఇప్పుడు చేపట్టిన కొత్త రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులతో ప్రతిపక్షాలకు ఉన్న ఆ కొంచెం అవకాశం కూడా ఉండదని ప్రజలు అంటున్నారు. మరమ్మతులే కాకుండా గ్రామాల్లో ఆర్థిక సంఘం నిధులతో కూడా రోడ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తవుతున్నాయి.

రోడ్లకు నిధుల విడుదల

అత్యవసర మరమ్మతుల్లో భాగంగా రూరల్ మండలంలోని హుకుంపేట రోడ్డుకు రూ.3 లక్షలు, ఆర్కేరోడ్డు వయా బొమ్మూరు రోడ్డుకు రూ.20 లక్షలతో పనులు ప్రారంభిస్తున్నారు. కడియం మండల పరిధిలోని కడియం – వెదురుమూడి రోడ్డుకు రూ. ఇరవయ్యారున్న లక్షలు, కడియం–జేగురుపాడు రోడ్డుకు రూ. 10 లక్షలు, వీరవరం–దుళ్ల రోడ్డుకు రూ.15 లక్షలు, దుళ్ల – మండపేట రోడ్డుకు రూ.5.4 లక్షలను కేటాయించారు. ఈ మేరకు పనులు ప్రారంభమై, చురుగ్గా జరుగుతున్నాయి.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- రుడా చైర్‌పర్సన్ షర్మిలా రెడ్డి
- ముగిసిన బాక్సింగ్ పోటీలు



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న షర్మిలా రెడ్డి

ప్రకాశం నగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి అన్నారు. ఎస్‌కేవీటీ పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న అండర్ 19 బాలబాలికల రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన షర్మిలా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాముఖ్యతనిస్తూ ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడాకారులకు గతంలో ఆహార ఏర్పాట్లను దాతల సహకారంతో చేయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం క్రీడాకారులకు ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, పూరీ, ఉడికించిన గుడ్డు, బాదం పాలు, మధ్యాహ్నం రెండు కూరలు, సాంబారు, పచ్చడి మజ్జిగతో పాటు భోజనం, పండ్లు అందజేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్, అర్బన్ రేంజ్ డీఐ దిలీప్ కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఆర్.నాగకుమార్, బాక్సింగ్ పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏవీడీ ప్రసాదరావు, జిల్లా పీడీ పీఈటీ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

కడియం ప్రభుత్వాస్పత్రి సందర్శన



వివరాలు నమోదు చేస్తున్న నీతి అయోగ్ బృందంలోని వైద్యులు

కడియం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని నీతి అయోగ్ బృందం సభ్యులైన డాక్టర్ సిద్ధి, డాక్టర్ మనీష్ కుమార్ గురువారం సందర్శించారు. అనిమియా ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిని సందర్శించి, ఇక్కడ అందుతున్న వైద్య సేవలను తనిఖీ చేశారు. అనిమియా నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. వివరాలను ఆసుపత్రి వైద్యులు మోహన వంశీ, అరుణ, శ్రీధర్ తదితరులు వారికి వివరించారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను నీతి అయోగ్ బృందం పరిశీలించింది.

శాటిలైట్‌సిటీ హైస్కూల్ పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం నీతి అయోగ్‌కు సంబంధించిన సెంట్రల్ టీం సభ్యులు సందర్శించారు. రక్తహీనత కలిగిన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కౌమరదశ బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ అందించడంపై అభినందించారు. వీరితో పాటు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం పాఠశాలను సందర్శించారు. మండల విద్యాశాఖాధికారి తిరుమలదాసు, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయిని బి.రాజరాజేశ్వరి, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లిడియా, సీహెచ్‌వో శేషమణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం



ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాను సన్మానిస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్, డైరెక్టర్లు



రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఖాదర్ బాషాకు ఆజాద్ చిత్ర పటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

- మైనార్టీ నేతల తీర్మానం
- జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఆరీఫ్

సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న మేలును, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఇంటికీ తిరిగి వివరించాలని తీర్మానించుకున్నట్లు జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మహమ్మద్ ఆరీఫ్ అన్నారు. ఈ మేరకు గురువారం విజయవాడలోని వక్ఫ్‌బోర్డ్ కార్యాలయంలో 'హర్‌దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్‌కే సాత్' రాష్ట్ర మైనార్టీలు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉపముఖ్య మంత్రి అంజాద్ బాషా, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ వి.ఖాదర్ బాషా ప్రసంగించారన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు గెలవాలన్న సీఎం ఆకాంక్షను నెరవేర్చేందుకు మైనార్టీలు కీలక భూమిక పోషించాలని సూచించినట్లు తెలిపారు. రాష్ట్ర నేతల ఆదేశాల మేరకు జిల్లాలో కార్యక్రమం విస్తృతం చేస్తామన్నారు. ప్రతి ఇంటికీ తిరిగి మైనార్టీలకు జగనన్న చేసిన మేలు వివరిస్తామన్నారు. సమావేశం అనంతరం తాను, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్లు ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మను ఘనంగా సత్కరించామన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రం పటం బహూకరించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ జిల్లా డైరెక్టర్లు షేక్ అహ్మద్, షేక్ జిలాని, షబ్బర్ బాషా, షేక్ ఇబ్రహీం, మహమ్మద్ జఫ్రుల్లా ఖాన్, పఠాన్ రహీం ఖాన్ పాల్గొన్నారు.

ఏపీకి మరోసారి మొండిచేయి

ప్రకాశం నగర్: కేంద్ర ప్రభుత్వం 2023 –24 బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి మొండిచేయి చూపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తీవ్రంగా విమర్శించారు. గురువారం స్థానిక శ్యామలా సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను ఆ పార్టీ నాయకులు దహనం చేశారు. అరుణ్ మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో సామాన్యులను విస్మరించిందని, టక్కుటమార విద్యలను ప్రదర్శిస్తూ మాటలతో మభ్యపెట్టిందని ఆరోపించారు. ఆ పార్టీ నగర కార్యదర్శి బి.పవన్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ

ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో భీమవరంలో జరిగిన జిల్లాస్థాయి రోప్ స్కిపింగ్ అండర్ 19 విభాగంలో ఎం.నాగదేవి ప్రథమస్థానంలో నిలిచిందని రాజమహేంద్రవరం గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. త్వరలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

అభినందన

కంబాలచెరువు: ప్రాజెక్టు వర్కులతో విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించవచ్చని రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.సంజీవ్ కుమార్ అన్నారు. అరవింద్‌నగర్‌కు చెందిన ఆర్.లవక్రిష్‌కు పాఠశాల యాజమాన్యం ఇచ్చిన పద్మశ్రీ అవార్డు ప్రాజెక్టు వర్కును ఆయన పరిశీలించి అభినందించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేసే దిశగా నగరంలో పార్టీ పటిష్టతకు అధిష్టానం ఆదేశాల మేరకు ప్రక్షాళన చర్యలు చేపట్టి అమలు చేస్తున్నట్లు నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో సేవలందించే వారిని గుర్తించి బాధ్యతలు అప్పగించడం జరుగుతోందన్నారు. ఈ మేరకు గురువారం నాలుగు డివిజన్లకు సంబంధించి ఇన్‌చార్జుల మార్పు వివరాలు ప్రకటించారు. 3వ డివిజన్ ఇన్‌చార్జిగా బళ్లా సత్యవతి, 33వ డివిజన్ ఇన్‌చార్జిగా గాదిరెడ్డి పెద్దబాబు, 38వ డివిజన్ ఇన్‌చార్జిగా అరిగెల బాబూ రాజేంద్ర ప్రసాద్, 49వ డివిజన్ ఇన్‌చార్జిగా బర్రే కొండబాబును నియమించామన్నారు. ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్లు, ఎంపీలు మిథున్ రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్ రామ్ నేతృత్వంలో పార్టీ పటిష్టతకు విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే కార్యాలయంలో నేరుగా వచ్చి వివరించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి




మురమండలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- మురమండలో గడపగడపకూ

కడియం: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని మురమండలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చందన పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. గ్రామంలో ప్రధాన రహదారి మరమ్మతు పనులను పరిశీలించారు. అప్పర్ ప్రైవేటు స్కూల్‌ను సందర్శించి, అక్కడ పలు సమస్యలు గుర్తించారు. మరమ్మతులకు వెంటనే అంచనాలు వేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, వారికి అందిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో సర్పంచ్ అయినవిల్లి రుక్మిణి, ఎంపీటీసీ మెల్లిమి మంగ, సహకార సొసైటీ అధ్యక్షుడు ఈదర దీనదయాళ్, వీవర్స్ సొసైటీ చైర్మన్ యర్రా సూర్యనారాయణ, పార్టీ నాయకులు అయినవిల్లి వెంకటేశ్వరరావు, మెల్లిమి గంగరాజు, వారరాము, ఊటుకూరి శైలజ, సచివాలయ కన్వీనర్లు కొప్పాక రమణ, బిల్లకుర్తి గంగాచలం, పైడిమళ్ల సత్యకుమారి, వెంపా గంగారావు, పల్లి హేమలత, బీరక మహేష్, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, ఎంపీడీవో కె.రత్నకుమారి, ఈవోపీఆర్‌డీ లక్ష్మి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నకూటోత్సవం

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అన్నకూటోత్సవం జరిగింది. పులిహోర ప్రసాదంతో వేంకటేశ్వరుని ప్రతిమను తయారు చేసి, భక్తుల దర్శనార్థం ఉంచారు. అంతకు ముందు ఆలయంలో నిత్యపూజలతో పాటు ప్రత్యేక అభిషేకాలను ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. రాత్రికి స్వామివారు హనుమంత వాహనంపై గ్రామంలో ఊరేగారు. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



పులిహోర ప్రసాదంతో రూపొందించిన వేంకటేశ్వరస్వామి ప్రతిమ

జనార్దనస్వామి ఆదాయం రూ.1.32 లక్షలు

ధవళేశ్వరం: లక్ష్మీజనార్దనస్వామికి హుండీ ద్వారా రూ.1.32 లక్షల ఆదాయం సమకూరింది. గడిచిన సంవత్సరానికి గానూ గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్ఎస్ పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవస్థానం అధికారులు, గ్రామస్తులు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



దుర్గబాబు, ప్రసన్నలను సత్కరిస్తున్న వ్యవసాయాధికారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ వీఏఏగా ఎంపికైన రాజవోలు వీఏఏ దుర్గబాబు, వీహెచ్ఏ ప్రసన్నలకు స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకుల వారి కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. దుర్గబాబుకు అవార్డు రావడం గర్వకారణమని వ్యవసాయాధికారి భీమరాజు అన్నారు. వ్యవసాయాధికారి శాంత ఆలివ్, ఏఈవోలు వేణు మాధవ్, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవమ్మకు నివాళి

రాజమహేంద్రవరం సిటీ: మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ 4వ డివిజన్ ఇన్‌చార్జి బొంత శ్రీహరి తల్లి రాఘవమ్మ ఇటీవల కన్నుమూశారు. గురువారం పెద్దకార్యం సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, యాళ్ల సురేష్ తదితరులు రాఘవమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రాఘవమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జక్కంపూడి రాజా, శివరామ సుబ్రహ్మణ్యం

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

ధవళేశ్వరం: ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని లక్ష్మీజనార్దనస్వామి కాలనీలో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ చీపిరి రాంబాబు (43) గురువారం మధ్యాహ్నం ఆటోపై బయటకు వెళ్లాడు. స్థానిక సాయిబాబా గుడి సమీపంలో ఆటోను తిప్పుతుండగా రామచంద్రపురం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య వనజ స్థానికంగా అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కాకినాడ క్రైం: గత నెల మూడో తేదీన రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలో కాళ్ల మీదుగా బస్సు వెళ్లిన ప్రమాదంతో తీవ్ర గాయాలపాలైన రాజమహేంద్రవరం నామవరానికి చెందిన అర్జి పార్వతి (66) గురువారం కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను తొలుత రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

అప్పుల ఒత్తిడితో వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: అప్పులు ఇచ్చిన వ్యక్తుల ఒత్తిడి తట్టుకోలేక తన తమ్ముడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని వీఎల్ పురం సత్యనారాయణపురానికి చెందిన నెల్లిపూడి సతీష్‌కుమార్ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిరణ్ కుమార్(38) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అప్పులు తీసుకునేవారికి మధ్యవర్తి సంతకం చేస్తూ నగదు ఇప్పిస్తుంటాడు. కిరణ్ కుమార్ కూడా కొంత సొమ్ము అప్పుగా తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వ్యక్తులు ఇంటికి వచ్చి ఒత్తిడి తేవడంతో ఇతడు బుధవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా రాత్రి 11.30 గంటల సమయంలో మృతి చెందాడు. బొమ్మూరు ఎస్సై శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

రాజమహేంద్రవరం సిటీ: అప్రమత్తతతో ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణా అధికారి కృష్ణారావు అన్నారు. గురువారం డీపీటీఓ అశోక షర్మిల అధ్యక్షతన ఆర్టీసీ గ్యారేజ్‌లో నిర్వహించిన 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహించి ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. అనంతరం ప్రతి డిపోకు ముగ్గురు చొప్పున 12 మంది ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ రజనీ, డిప్యూటీ సీఎంఈ రవిశంకర్, డిపో మేనేజర్ షేక్ షబ్నం పాల్గొన్నారు.



ఆర్టీసీ డ్రైవర్లను సత్కరిస్తున్న అధికారులు

బస్సులు ఆపడం లేదని విద్యార్థుల ఆందోళన

సీతానగరం: బొబ్బిల్లంక వద్ద ఆర్టీసీ బస్సులను ఆపివేసి గురువారం ఉదయం 8 గంటలకు విద్యార్థులు ఆందోళనకు దిగారు. వారు సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామం నుంచి రాజమహేంద్రవరంలోని పలు కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్నామన్నారు. అయితే గ్రామంలో బస్సులు నిలపడం లేదన్నారు. ఉదయం 7 గంటల నుంచి రోడ్డుపై ఉంటున్నా సమయానికి కళాశాలలకు వెళ్లలేకపోతున్నామన్నారు. అనంతరం 9 గంటలకు విద్యార్థులు తమ నిరసన విరమించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

విధులకు ఆటంకం కలిగించారని కేసు

తమ విధులకు ఆటంకం కలిగించారని ఆర్టీసీ కండక్టర్ బీవీవీ సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యార్థి హేమంత్ కుమార్‌పై కేసు నమోదు చేశామని గురువారం హెడ్ కానిస్టేబుల్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం బొబ్బిల్లంక వద్ద ఆర్టీసీ బస్సును 45 నిమిషాలు నిలిపి, తమ విధులకు ఆటంకం కలిగించాడని కండక్టర్ ఫిర్యాదు చేశారన్నారు.

సాక్షి-సినిమాలు



శ్యామల :	వారసుడు
సూర్యమినీ :	మాలికాపురం
సూర్యప్యాలెస్ :	పఠాన్
స్వామి :	వాల్తేరు వీరయ్య
శివజ్యోతి :	మైఖేల్
అనుశ్రీ :	మైఖేల్
రాజా :	పఠాన్
అశోక :	వీరసింహారెడ్డి
కుమారి :	సువర్ణసుందరి
ఊర్వశి :	పఠాన్
రంభ :	బుట్టబొమ్మ
మేనక :	ప్రేమదేశం
గీతాఅప్సర : నామవరం	రైటర్ పద్మభూషణ్
వీఎస్ మహల్ : ధవళేశ్వరం	పఠాన్
మురళీకృష్ణ : కడియం	వాల్తేరు వీరయ్య
వెంకటసూర్య :	మైఖేల్